క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ రవళి


ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ

మల్యాల: మండల ఎంపీపీగా ఎన్నికైన ఆగంతపు రవళి ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు, ఎంపీపీగా తన నియామకానికి సహకరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మెన్ రాంలింగారెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నేరేళ్ల సతీశ్‌రెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో ఫోక్ సాంగ్ చిత్రీకరణ


దేవ టూన్స్ చిత్ర యూనిట్ బృందం

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్‌లో దేవ ట్యూన్స్ ఫోక్‌సాంగ్స్ చిత్ర బృందం వారు సందడి చేశారు. గ్రామంలోని రాముల వారి కొండపై ప్రత్యేక పూజల అనంతరం సాంగ్ నిర్మాణం చేశారు. చిత్రీకరణ చూడటానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో హీరోయిన్ యూ ట్యూబ్ ఫేమ్ నీతు క్వీన్, హీరో వంశీ, కెమెరామెన్ అరవింద్, కొరియోగ్రాఫర్ ప్రశాంత్, డ్యాన్సర్ కావ్యరీచా, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి

కథలాపూర్: మండల శివారులోని రాళ్లవాగు ప్రాజెక్టు కాలువను మరమ్మతులు చేయించాలని మండల కాంగ్రెస్ నాయకులు వాకిటి రాజారెడ్డి, పాల్తెపు గంగారాం, గడ్డం చిన్నారెడ్డి, తిరుపతిరెడ్డి ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలంలో రాళ్లవాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లు చేరుతాయని, కాలువలకు మరమ్మతు చేయిస్తే ఐదు గ్రామాల భూములకు నీరందుతుందని విన్నవించారు. సంబంధిత అధి కారులతో మాట్లాడి త్వరగా పనులు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వృద్ధుడిని పరీక్షిస్తున్న డాక్టర్ కృష్ణతేజ

సారంగాపూర్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సారంగాపూర్ మండలం పెంబట్లలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో డాక్టర్ కృష్ణతేజ రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మొబైల్ మెడికేర్ యూనిట్ సభ్యులు, ఆశావర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం



వెల్గటూర్: పైడిపెల్లి సబ్‌స్టేషన్‌లోని ఫీడర్లకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

‘డబుల్’ జాప్యం.. వాహనదారులకు శాపం

- ఏడాదిగా కొనసాగుతున్న పనులు
- కంకర తేలిన రోడ్డు..
- దుమ్ముతో వాహనదారులకు ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

మల్యాల: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది మల్యాల మండల కేంద్రంలోని డబుల్ రోడ్డు పరిస్థితి. రోడ్డు విస్తరణ పనులు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. రోడ్డు విస్తరణలో జాప్యం వాహనదారులకు శాపంగా మారింది. రోడ్డుపై తారు వేసేందుకు కంకరపోసి, ఏడాది కాలం గడుస్తున్నా తారు వేసేందుకు చొరవ చూపడం లేదు. మండల కేంద్రంలోని బ్లాక్ ఆఫీస్ చౌరస్తా నుంచి పెగడపల్లి వరకు సుమారు 14 కిలోమీటర్ల మేర ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ తారు రోడ్డుగా విస్తరించేందుకు కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యాయి. ఏడాదిక్రితం రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసినా, పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

రోడ్డు విస్తరణ పనులకు గతేడాది ఫిబ్రవరి 25న అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ శంకుస్థాపన చేశారు. కానీ విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో రోడ్డంతా కంకరతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రం నుంచి పెగడపల్లికి డబుల్ రోడ్డు, మల్యాల మండలంలోని తక్కళ్లపల్లి వరకు సుమారు 7 కిలోమీటర్లు ఉండగా, కంకర తేలిన రోడ్డుపై వాహనదారులు వెళ్లేందుకు మల్యాల, మానాల, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి గ్రామాలకు వెళ్లే ప్రజలతోపాటు పెగడపల్లికి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా కంకర తేలడంతోపాటు దుమ్ము రేగుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విస్తరణ జాప్యంపై నోరు మెదపని నాయకులు..


మల్యాల నుంచి పెగడపల్లి వెళ్లే రోడ్డుపై కంకర రాళ్లు

మల్యాల నుంచి పెగడపల్లి వరకు 14 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం (సీఆర్ఐఎఫ్) నిధులు రూ.20కోట్లు మంజూరు చేసింది. తాము కేంద్రానికి లేఖ రాసి, నిధులు విడుదల చేయించామని, ఎంపీ బండి సంజయ్ నిధులు విడుదల చేయించారని బీజేపీ నాయకులు నిధుల విడుదలకు మేమంటే.. మేము కృషి చేశామంటూ పోటాపోటీగా ఇటు అప్పటి సీఎం కేసీఆర్, అటు ప్రధాని మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. డబుల్ రోడ్డు విస్తరణ పనుల కోసం శంకుస్థాపన చేసి, ఏడాది గడుస్తున్నా విస్తరణ పనులు పూర్తికాక, వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఇటు బీజేపీ నాయకులు గాని, అటు బీఆర్ఎస్ నాయకులు గానీ నోరు మెదపడం లేదు.

నడవలేకపోతున్నాం..



మల్యాలలోని గీత కార్మికులు కల్లుకుండలు పట్టుకుని రోడ్డుపై నుంచి వెళ్లలేకపోతున్నారు. కనీసం నడిచి కూడా వెళ్లలేని పరిస్థితి. దీనికి తోడు కళ్లలో దుమ్ముపడి, ఇబ్బందిపడుతున్నారు. రోడ్డంతా కంకర తేలడంతోపాటు వాహనాలు పంక్చర్ అవుతున్నాయి.

– పొన్నం బక్కుల శ్రీనివాస్ గౌడ్, మల్యాల

డబుల్ రోడ్డు పనులు పూర్తిచేయాలి



డబుల్‌రోడ్డు విస్తరణ పనులు ఏడాదికాలంగా సాగుతున్నాయి. తారు వేసేందుకు రోడ్డుపై కంకర వేసి, వదిలేయడంతో కంకర్రపై వెళ్లలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేయాలి.

– ఎడిపెల్లి రాజన్న, మానాల మాజీ ఉప సర్పంచ్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు,గురువులు

మెట్‌పల్లిరూరల్: ఇరవై ఐదేళ్ల క్రితం మెట్‌పల్లి మండలం వెల్లుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1998–99వ బ్యాచ్ విద్యార్థులంతా ఆదివారం వెల్లుల శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తాము చదువుకున్నప్పటి విషయాలు గుర్తు చేసుకుని సందడి చేశారు.నాటి స్మృతులతో ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు.బాల్యపు మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలకంఠం, లక్ష్మీనర్సయ్య , భూమాచారి, సుధాకర్, అంజిరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పెగడపల్లి:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యారుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాల్య మిత్రులంతా వారి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించారు.

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని శారద విద్యానిలయం 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సంగీత్ రెస్టారెంట్ బంకెట్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని ఆటపాటలతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల రోజుల్లోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోరుట్ల: కోరుట్ల డిగ్రీ కళాశాలలో 2004–07 సంవత్సరం డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో సుమారు 70 మంది బీ.కాం విద్యార్థుల హాజరై పాత జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. అనంతరం తమకు చదువులు చెప్పిన గురువులు మేడి కిషన్, చంద్రశేఖర్, విజయ్‌కుమార్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలి వాసవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


కోరుట్ల డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

రైతులకు సరిపడా విత్తనాలను పంపిణీ చేస్తాం


విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఈవో సంధ్య, ప్యాక్స్ సీఈవో రమేశ్

మల్లాపూర్: వానాకాలం సీజన్‌లో రైతులకు సరిపడా విత్తనాలను పంపిణీ చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య అన్నారు. మండలంలోని ముత్యంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆదివారం వ్యవసాయ, ప్యాక్స్ అధికారులతో కలిసి రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల రైతులకు సరిపడా జనుము, జీలుగ విత్తనాలు విడతల వారీగా వస్తున్నాయన్నారు. సోమవారం మొగిలిపేట డీసీఎంఎస్, సాతారం, కుస్తాపూర్ గ్రామాల్లోని ఆగ్రోస్ కేంద్రాలలో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉంటాయని, అవసరమైన రైతులు పట్టాపాసుపుస్తకాలతో వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఇంకా ఏవైనా సందేహాలు ఉంటే 7288894135 నెంబర్‌కు గాని, వ్యవసాయ అధికారిని గాని, విస్తరణ అధికారులను గాని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సంధ్య, ప్యాక్స్ సీఈవో రమేశ్, రైతులు రాజేశ్వర్‌రెడ్డి, సాయన్న, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన

పెగడపల్లి:విత్తన కొనుగోలులో రైతులు తగిన జాగ్రత్తలు వహించాలని ఏఈవో మల్లేశం సూచించారు. మండల కేంద్రంలో సహకార సంఘ కార్యాలయం ఆవరణలో ఆదివారం వానకాలం సీజన్‌లో విత్తుకోవాల్సిన పంటలు, విత్తన కొనుగోలుపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. విత్తనాలు కొనుగోలు చేస్తే సంబధిత రశీదు తీసుకుని భద్రపరుచుకోవాలని, ప్యాకెట్ విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని ఏఈవో మల్లేశం సూచించారు.

ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణ టీఆర్‌నగర్‌కు చెందిన పోషయ్య కూతురు దుర్గ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా వార్డు నాయకులు ఆమె ఆరోగ్య పరిస్థితిని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకుపోగా, రూ. 1.20 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించి, ఆదివారం దుర్గ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దామోదర్‌రావు, కౌన్సిలర్ కూసరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో ఈదురు గాలుల వల్ల ఇళ్లు, పంటలు నష్టపోయినవారిని ప్రభుత్వం ఆదుకోవాలని మండల బీఆర్ఎస్ నాయకులు కొండ ఆంజనేయులు, మైస శ్రీధర్, పాలెపు రాజేశ్ ఆదివారం డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టాలు జరిగితే అధికారులు త్వరగా స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈదురుగాలుల వల్ల నష్టపోయిన గ్రామాల్లో అధికారులు పర్యటించి బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

మల్యాల: మండలంలోని పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ విత్తనాలు 60 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్ తెలిపారు. మల్యాల, నూకపల్లి, తక్కల్లపల్లి, పోతారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలతో పాటు మల్యాల, మద్దుట్ల డీసీఎంఎస్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. 30 కిలోల జీలుగ బస్తాకు రూ. 1116, 40 కేజీల జనుము బస్తాకు రూ.1448 చెల్లించి విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు.

నేషనల్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

కొండగట్టు: సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ సెమ్స్ ఒలంపియాడ్ 2024లో కొడిమ్యాల మండలం పూడూర్ మానేరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్టు పాఠశాల యాజమాన్యం ఆదివారం తెలిపింది. 8వ తరగతికి చెందిన పి.అక్షయ్ స్టేట్ ఒకటో ర్యాంకు, 5వ తరగతి సీహెచ్ అంజలి జోనల్ 4వ ర్యాంకు, 6వ తరగతి ఇసాస్‌రావు జోనల్ 7వ ర్యాంకు,5వ తరగతి శ్రీ చేతన జోనల్ 10 వ ర్యాంకు, 3వ తరగతి హరిప్రియ జోనల్ 11వ ర్యాంకు, హరిచందన జోనల్ 12వ ర్యాంకు, 4వ తరగతి విక్రాంత్ జోనల్ 13వ ర్యాంకు, 5వ తరగతి హదీనా జోనల్ 13వ ర్యాంకు, 7వ తరగతి మనోజ్ సాయి జోనల్ 22వ ర్యాంకును విద్యార్థులు సాధించారు.


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ అనంతరెడ్డి

ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కడారి సునీతారెడ్డి, కడారి కృష్ణారెడ్డి, కడారి శ్వేత రెడ్డి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

ఆలయ అభివృద్ధి పనుల్లో జాప్యమెందుకు?

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి పనులు ప్రారంభించడంలో దేవాదాయశాఖ అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో వివరించాలని ఆలయ మాజీ చైర్మన్ గోనె వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆలయ పునఃనిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో రూ. 35 లక్షలు మంజూరు చేయగా, ప్రస్తుత ప్రభుత్వంలో రూ.42 లక్షలతో టెండర్ ప్రక్రియ నిర్వహించారని ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదన్నారు. పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కూడా పూర్తయిందని, దేవాదాయ శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించి పనులు ప్రారంభించేలా చూడాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ధర్మపురి: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలైనాయి. స్థానికుల వివరాలు.. మండలంలోని ఆకసాయిపల్లె గుట్టమలుపు వద్ద ఆదివారం సాయంత్రం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి తీవ్రగాయాలైనాయి. క్షతగాత్రులను 108లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా, జగిత్యాల జిల్లా గుల్లకోట (రొడ్డాం)కు చెందిన మెడపట్ల లక్ష్మీరాజం(52) మృతిచెందాడు. ఈప్రమాదంలో గాయపడిన సుజాత, దండెపెల్లి మండలానికి చెందిన అంజన్న, మరొకరు చికిత్స పొందుతున్నారు.

కోటేశ్వరుడికి పూజలు

వెల్గటూర్: ఐపీఎల్ ఫైనల్‌లో ఎస్సార్‌హెచ్ గెలవాలని వెల్గటూర్ మండలం కోటిలింగాల కోటేశ్వర స్వామికి వెల్గటూర్ యువకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంపెల్లి సతీష్, వికాస్, సాయి, పవన్, కిట్టు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం అందిస్తున్న ఇన్నోవేటర్స్ సభ్యులు

రాయికల్: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన మ్యాడరపు అనిల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబానికి ఆదివారం రాయికల్ కు చెందిన ఇన్నో వేటర్స్ సభ్యులు రూ.10 వేలు,కొత్తపేట గ్రామానికి చెందిన యునైటెడ్ వారియర్స్ సభ్యులు రూ.8 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశం, ఉపసర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి ఇన్నోవేటర్స్ సభ్యులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యువకులు

మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన మంద భాజమ్మ అనే అనాథ వృద్ధురాలు ఆదివారం మృతి చెందగా, గ్రామ యువత నాయకులు విరాళాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు.

నూతన కార్యవర్గం నియామకం



అసోసియేషన్ ప్రతినిధుల సన్మానం

కోరుట్లటౌన్: కోరుట్ల పట్టణ ఆర్ఎంపీ,పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా సంద శ్రీపతి, కార్యదర్శిగా కొక్కుల శ్రీనివాస్, కోశాధికారిగా సూర్యప్రకాశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంద శ్రీపతి మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజగంగారాం, నరహరి, అబ్దుల్లా, ఆడెపు వెంకటేష్, సిద్దిఖీ, రామ్‌మోహన్, సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ అధ్యక్షుడిగా రాజేశం

రాయికల్: మండలంలోని భూపతిపూర్ ముదిరాజ్ సంఘ అధ్యక్షునిగా రొండ్ల రాజేశం,ఉపాధ్యక్షునిగా కట్టరాజయ్య, కోశాధికారిగా జికురి లక్ష్మీనారాయణ,సలహాదారులుగా కట్ట ప్రసాద్, తునికి రాజేశం, బక్కయ్య, రమేశ్, సురేశ్ ఆదివారం ఏకగ్రీవంగా నియమించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని గీత పారిశ్రామిక సంఘం, గౌడ కులస్తులు నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మకు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గీత పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు సాయిరాం గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, గౌడ కులస్తులు, మహిళలు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని కుమ్మరిపెల్లి, ఇటిక్యాలలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


కుమ్మరిపెల్లిలో పోచమ్మ బోనాలతో మహిళలు


రాయికల్: బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గౌడ కులస్తులు